క్లుప్తంగా

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దారు రామారావు

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని తహసీల్దారు రామారావు సూచించారు. మండలంలోని బూరాడ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సందర్శించిన ఆయన.. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, స్టాకు వివరాలను పరిశీలించారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని, పౌష్టికాహారం పంపిణీలో అలస్యం చేయొద్దని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

వంగర: మండల పరిధిలోని బాగెంపేటలో 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో అధికారులు శనివారం హుటాహుటిన ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో సర్పంచ్ రెడ్డి సత్యవతి విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావుకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన శనివారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు జరిగేలా చొరవ తీసుకున్నారు. సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై విద్యుత్ శాఖ సిబ్బందిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి

రాజాం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి, ఓటుహక్కు కోసం ఈ నెల 6వ తేదీలోగా ఉపాధ్యాయులంతా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు ఎస్.కె.రాజు ఓ ప్రకటనలో శనివారం కోరారు. ఫారం-19లో ఉపాధ్యాయులు తమ వివరాలు పొందుపరిచి, ఆన్‌లైన్ ద్వారా గానీ నేరుగా తహసీల్దారు కార్యాలయానికి గానీ అందించవచ్చన్నారు.

తక్షణమే హామీలు అమలు చేయండి

బొబ్బిలి: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం జరిగిన మున్సిపల్ కార్మికుల సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, సహజ, ప్రమాదవశాత్తు సంభవించిన మరణాలకు పరిహారం ఇస్తామని చెప్పారని, వాటి గురించి ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. సమావేశంలో బి.యుగంధర్, జి.వాసు, జి.శంకరరావు, జి.గౌరి, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

రాజాం: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని రాజాం వికాస తరంగణి రాష్ట్ర సంస్కార్ అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో యోగాసనాలు-వాటి ప్రయోజనాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా యోగాసనాలు సాధన చేయాలన్నారు. యోగా చేసిన వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

మంచి అలవాట్లు అలవర్చుకోవాలి

రాజాం సిటీ: విద్యార్థులు బాల్యం నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ రోడ్డు పాఠశాలలో విద్యార్థులకు మంచిచెడులపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నీతికథలు వినడం, చదవడం ద్వారా మంచి విషయాలు తెలుస్తాయన్నారు. తోటివారికి సహాయం చేసే గుణం కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాల బారినపడవద్దన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



బొడ్డవలసలో నిర్మించిన సీసీ రోడ్డు

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీ పరిధిలో ఉన్న బొడ్డవలస గ్రామంలో రూ.6 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. 15వ ఆర్థికసంఘం నిధులతో ఈ నిర్మాణ పనులు చేపట్టామని సర్పంచ్ పట్టాభి, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు.

సంగమేశ్వరుడి దర్శనం..
సకల పాప హరణం!

- నంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరాలయం
- బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగంతో ఆలయానికి ప్రాచుర్యం
- అలహాబాద్ తరహాలో త్రివేణి సంగమం
- కార్తీకమాసంలో దర్శనానికి భక్తుల ఆసక్తి



వంగర: బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం



వంగర: సంగమేశ్వర స్వామి ఆలయం

వంగర:

మండలంలోని సంగాంలో వెలసిన సంగమేశ్వరుడిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ముఖ్యంగా కార్తీకమాసంలో ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివచ్చి, దైవదర్శనం చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తారు. ద్వాపరయుగంలో బలరాముడు ఏకకాలంలో ప్రతిష్ఠించిన ఐదు శివలింగాల్లో ఇక్కడి శివలింగం ఒకటి కావడంతో ఈ ఆలయానికి విశేష ప్రాచుర్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో శివుడి భక్తుల్లో ప్రతిఒక్కరూ ఏటా కార్తీకమాసంలో ఇక్కడి శివలింగాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేస్తారు. కార్తీకమాసం పురస్కరించుకుని, ఆలయ విశిష్టతపై ప్రత్యేక కథనం..

త్రివేణి సంగమంలో స్నానం.. పరమ పావనం..

ఆలయ ప్రాంగణంలోని నాగావళి, సువర్ణముఖి, వేగావతి నదులు కలిసే ప్రాంతం ఉండగా, ఇదే త్రివేణి సంగమంగా ప్రసిద్ధి పొందింది. కార్తీకమాసం రోజుల్లో భక్తులు ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరించి, సంగమేశ్వరుడిని దర్శించుకుంటే సకల పాప హరణం జరుగుతుందని భక్తులకు నమ్మకం. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్ తరహాలోనే ఈ ప్రదేశంలో మూడు నదులు కలిసే చోటు ఉండగా, ఇక్కడి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసి, భగవంతుడి దర్శనానికి భక్తులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తుండడం విశేషం.

పితృదేవతలను స్మరించే స్థలం..

మూడు నదులు కలిసే త్రివేణి సంగమం ఒడ్డున పితృదేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయ ప్రాంగణంలోని 400 ఏళ్ల నాటి భారీ మర్రివృక్షం ఉంది. ఈ చెట్టు నీడన వంటావార్పు చేసి, త్రివేణి సంగమంలో పితృదేవతలకు పిండప్రదానాలు చేస్తారు. అలా చేస్తే మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని భక్తులు విశ్వసిస్తారు.

సంగాం ఇలా వెళ్లొచ్చు..

రాజాం పట్టణానికి 23 కిలోమీటర్లలో సంగాం గ్రామం ఉంది. వంగర, రుషింగి, కొప్పర గ్రామాలకు వెళ్లే బస్సులు ఎక్కితే మెట్ట మగ్గూరు వద్ద దిగి, అక్కడి నుంచి ఆటోలో సంగాం చేరుకోవచ్చు. ఉదయం 7.15, 8.00, 9.00, 11.00 గంటలకు, మధ్యాహ్నం 3, 4.30, 6 గంటలకు రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సులు ఉన్నాయి. అలాగే రాజాం నుంచి సంగాం వరకు ఆటోలు కూడా ఉంటాయి. 50 నిమిషాల పాటు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోను ఆనందరావు, ఈవో పొన్నాడ శ్యామలరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్తీకమాస పూజలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

108 స్తంభాల గుడి..



ఎం.సీతారాంపురంలో 108 స్తంభాల గుడి

ఎం.సీతారాంపురంలో 108 స్తంభాల శివాలయం ఉంది. 450 ఏళ్ల క్రితం దీనిని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన వారు నిర్మించారని పూర్వీకులు చెబుతున్నారు. ఆలయం లోపలి ఉన్న 108 స్తంభాలతో గుడి గోపురం ఇమిడి ఉంటుంది. ఆలయ కుడ్యాలపై వెలసిన దేవతామూర్తుల విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటాయి. కార్తీక మాసంలో ఇక్కడి ఆలయానికి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ-సర్వీస్ రెమిటెన్స్‌లు సకాలంలో చెల్లించాలని, గ్రీన్ అంబాసిడర్లకు ఏ నెల జీతాలు ఆ నెల ఇవ్వాలని, పల్లె పండగ కార్యక్రమాలు, ఉపాధి హామీ పథకం పనులను పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్టు తయారు చేయాలని, జమ ఖర్చుల వివరాలు పొందుపరచాలని, క్లోరినేషన్, వాటర్ ట్యాంకుల క్లీనింగ్, తాగునీటి స్వచ్ఛత పరీక్షలకు చెందిన రికార్డులను విధిగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



అంబకండి కాలనీ పాఠశాలలో పిల్లలకు వడ్డించిన ఆహారాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: మండలంలోని సోమరాజుపేట, వండానపేట, అంబకండి కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు శనివారం తనిఖీ చేశారు. వంటకాలు ఏ విధంగా ఉన్నాయని రుచి చూసి పరిశీలించారు. మెనూ ప్రకారమే వంటకాలు చేయాలని, పదార్థాలు రుచి, శుచి కలిగి ఉండాలని సిబ్బందికి సూచించారు.

ఇసుక అక్రమ రవాణా ఆగలేదు..

రేగిడి: మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇసుక తరలింపును అడ్డుకోవాలని మండలంలోని మజ్జిరాముడుపేట గ్రామ మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు కోరుతున్నారు. అక్రమ ఇసుక తరలింపుపై చర్యలు తీసుకుంటున్నామని, ఉచిత ఇసుక అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఊకదంపుడు ప్రసంగాలే తప్ప ఆ దిశగా ఏమాత్రం చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలే ఇసుక, మద్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అక్టోబరు 28వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌కు తాను హాజరై, ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు చేశానని, అయితే దానిని పరిష్కరించుకుండానే పరిష్కరించామని అధికారులు ఆ ఫిర్యాదును క్లోజ్ చేశారన్నారు.

రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ ఈశ్వరరావు

వంగర: బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వంగర ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ మామిడి ఈశ్వరరావు కోరారు. మండలంలోని రుషింగి గ్రామంలో రైతులు, బ్యాంకు ఖాతాదారులతో శనివారం సమావేశమైన ఆయన.. బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించారు. మహిళలకు, డ్వాక్రా సంఘాలకు అందించే రుణాలతో పాటు పంట రుణాలు, బంగారు ఆభరణాలపై ఇచ్చే రుణాలు, ఇంటి రుణాలు తీసుకుంటే వచ్చే ప్రయోజనాలను వివరించారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

వంగర: జీడి, మామిడి పంటలు సాగు చేస్తున్న రైతులంతా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని రాజాం ఉద్యాన శాఖాధికారి సీహెచ్ ఉమామహేశ్వరి సూచించారు. ఎకరా విస్తీర్ణంలోని జీడి, మామిడి పంటలకు సంబంధించి, రూ.1500 చెల్లించాలని, ఎన్ని ఎకరాలకు అయినా బీమా చేయించుకునే అవకాశం ఉందన్నారు. బీమా చేయించుకుంటే ఏదైనా ప్రకృతి విపత్తు కారణంగా పంట నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.30 వేలు చెల్లిస్తామన్నారు. ఈ నెల 15వ తేదీలోగా కామన్ సర్వీస్ సెంటర్స్(సీఎస్‌సీ), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్), నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్(ఎన్‌సీఐపీ) ద్వారా ప్రీమియం చెల్లించవచ్చన్నారు.

బ్యాంకుల్లో నగదు జమ చేయండి

బొబ్బిలిరూరల్: గ్రామాల్లోని సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలకు గాను వారి నుంచి వసూలు చేస్తున్న నగదును ఎప్పటికప్పుడు బ్యాంకుల్లో జమ చేయాలని డీఎల్‌డీవో ఎం.కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆయన.. కరెంట్ బిల్లులు, ఇతర ధ్రువపత్రాల కోసం ప్రజలు చెల్లిస్తున్న రుసుములను ఏరోజు వచ్చినవి ఆరోజే బ్యాంకుల్లో వేయాలని తెలిపారు. మూడు రోజులకోసారి బ్యాంకుల్లో నగదు జమ చేయడం ద్వారా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు చేపట్టాలి

బాడంగి: ఓటర్ల నమోదును పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దారు కె.సుధాకర్ సూచించారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడిన ఆయన.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలని, 2025 జనవరి నాటికి 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 9, 10, 23, 24వ తేదీల్లో పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారంతా ఆన్‌లైన్‌లో గానీ ఆఫ్‌లైన్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఇంకుడు గుంతలు తవ్వుకోండి

బొబ్బిలిరూరల్: ఇంటి దగ్గర ఇంకుడు గుంతలు తవ్వుకుంటే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఏపీడీ ఎం.కిరణ్‌కుమార్ సూచించారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నామని, వీటిని ప్రతిఒక్కరూ ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను సంరక్షించుకోవచ్చని తెలిపారు. ఇంటి దగ్గర ఏర్పాటు చేసుకునే ఒక్కో గుంతకు రూ.6 వేలు, తోటల్లో నిర్దేశిత కొలతల మేర ఏర్పాటు చేసే గుంతలకు రూ.32 వేలను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

గ్రామసభల్లో 'ఉపాధి' పనుల గుర్తింపు



గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తిస్తున్నామని ఏపీవో ఎస్.హరనాథరావు తెలిపారు. మండలంలోని వన్నలి గ్రామంలో శనివారం జరిగిన గ్రామసభకు హాజరైన ఆయన.. ఉపాధి హామీ పనులపై చర్చించారు. గ్రామసభ ఆమోదం పొందిన తర్వాత పనులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, రూ.75 లక్షల విలువైన పనులను ఇంతవరకు గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గార రమణ, ఈసీ రామినాయుడు, టీఏ సత్తిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మండలంలోని అన్ని పంచాయతీల్లో పూర్తి స్థాయిలో పనులు గుర్తించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో శనివారం సమావేశమైన ఆయన.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులు గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం, ఈసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మరో అవకాశం కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

రాజాం సిటీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మరొక అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ రఘువర్మ కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఏపీటీఎఫ్ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పీఆర్‌సీ అమలు, ఐఆర్ త్వరితగతిన ప్రకటించేందుకు, సీపీఎస్ రద్దుకై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానన్నారు. ఉపాధ్యాయులకు ఇబ్బంది కలిగితే ఎంత స్థాయిలోనైనా పోరాటం చేస్తానన్నారు. ఎప్పుడు ఫోన్ చేసినా అందుబాటులో ఉంటానన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, విజయనగరం జిల్లా నాయకులు నల్లా రవికుమార్, మురపాక వెంకటరమణ, బి.వి.అచ్యుత్‌కుమార్, పిల్లా తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



కార్తీకమాసం ప్రారంభం పురస్కరించుకుని, శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం వేకువజాము నుంచే మందిరాలకు పోటెత్తిన భక్తులు శివుని దర్శనానికి తహతహలాడారు. గంటల కొద్దీ క్యూలైన్‌లో నిలబడి భగవంతుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రేగిడి మండలంలోని సంకిలి, మంగళపేట, రేగిడి, ఖండ్యాం, వన్నలి గ్రామాల్లోని మందిరాలు భక్తులతో నిండుగా దర్శనమిచ్చాయి. -రేగిడి

అల్లుకున్న నిర్లక్ష్యం





రామభద్రపురం మండలం, తారాపురం ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా జాతీయ రహదారి పక్కన, ఇట్లమామిడిపల్లి వెళ్లే రోడ్డు దగ్గర పంటపొలాల గట్టుపై ఉన్న విద్యుత్‌స్తంభాలను చూస్తే విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. దట్టంగా అల్లుకున్న తీగజాతి మొక్కలతో అక్కడి స్తంభాలు, విద్యుత్ తీగలు చాలా ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్ ప్రమాదాలు, కరెంట్ సరఫరాలో అంతరాయానికి కారణమైన ఇటువంటి వాటిని తొలగించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉండగా, ఆ దిశగా అధికారుల చర్యలు శూన్యంగా ఉండడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వాటిని తొలగించాలని కోరుతున్నారు.

- రామభద్రపురం

భగవద్గీత.. మోక్ష ప్రదాయిని



టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రాజాంలోని విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు శనివారం పంపిణీ చేశారు. భగవద్గీత మోక్ష ప్రదాయిని అని, ప్రతిఒక్కరూ భగవద్గీతను చదివి, అందులోని సారాంశాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలని టీటీడీ రాజాం శాఖ ఇన్‌చార్జ్ జె.శ్యామలరావు విద్యార్థులకు తెలిపారు. జీవిత సారాంశం తెలిపే భగవద్గీతను చదివితే ఎటువంటి సమస్యను అయినా సామరస్యంతో అధిగమించవచ్చన్నారు. -రాజాం సిటీ

పాల ధరల తగ్గింపు నిర్ణయం వెనక్కితీసుకోవాలి



పాల ధరల తగ్గింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన కొంతమంది పాడిరైతులతో బొబ్బిలి మండల కేంద్రంలో ఎమ్మెల్యే బేబీనాయనను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ డెయిరీ పాల ధరలు తగ్గించడంతో పాడిరైతులు నష్టపోయే పరిస్థితులను ఆయనకు వివరించారు. లీటరు ఆవుపాలకు రూ.50, లీటరు గేదెపాలకు రూ.80 ఇవ్వాలని, డెయిరీకి వచ్చే లాభాల నుంచి పాడిరైతులకు బోనస్ ప్రకటించాలని కోరారు.

- బొబ్బిలి

మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణం అడ్డగింత



బొబ్బిలి పట్టణంలోని పాకివీధిలో పారిశుధ్య కార్మికుల ఇళ్లస్థలాల కోసం ప్రతిపాదించిన స్థలంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్(కర్మాగారం) నిర్మాణం చేపట్టడాన్ని పారిశుధ్య కార్మికులు శనివారం అడ్డుకున్నారు. ఉదయం నిర్మాణ పనుల నిమిత్తం మున్సిపల్ అధికారులు, కాంట్రాక్ట్ సిబ్బంది అక్కడికి యంత్రాలతో రాగా, వారి చర్యలను అడ్డుకుని, నిరసనకు దిగారు. తమ కోసం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణం చేపట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మాణం జరగనివ్వమని భీష్మించుకుని కూర్చోవడంతో పనుల కాంట్రాక్ట్ సిబ్బంది వెనక్కి తగ్గారు. తమకు తక్షణమే ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని అధికారులను నిరసనకారులు కోరారు. - బొబ్బిలి